డంపింగ్ యార్డుగా రైల్వే కాలనీ

- కడిపికొండ బ్రిడ్జి కింద చెత్తకుప్పలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న క్వార్టర్స్ వాసులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే క్వార్టర్స్ ఈఎల్ఎస్ కాలనీ డంపింగ్ యార్డుగా మారింది. రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ కాలనీలో సమీపంలోని కడిపికొండ ఆర్వోబీ కింద ప్రాంతమంతా చెట్లు పెరిగి, చెత్తాచెదారం, చెత్తకుప్పలు పెద్ద ఎత్తున పేరుకుపోయి డంపింగ్ యార్డులా తయారైందని రైల్వేకాలనీ వాసులు అంటున్నారు. క్వార్టర్స్ ప్రాంతంలో బయటి నుంచి వ్యక్తులు చెత్తాచెదారంను తీసుకొచ్చి ఇక్కడ పారేసి వెళ్తుండడంతో ఈ ప్రాంతమంతా డంపింగ్ యార్డుగా మారిందని వాపోతున్నారు. ఆర్వోబీ కింద ఇరువైపుల రోడ్ల నుంచి రైల్వే కార్మిక కుటుంబాలు, కార్మికులు ఇతర అవసరాలకు, విధులకు వెళ్లి వస్తుంటారు. రోడ్డుపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో రోడ్ల గుండా వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా బ్రిడ్జి గోడలకు పెరిగిన చెట్టు పెరిగి పెద్దదై బీటలు బారి బ్రిడ్జికి ప్రమాదం జరుగకముందే చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్వోబీ కింద గ్రీనరీ ఏర్పాటు చేయాలి

రైల్వే ఈఎల్ఎస్ కాలనీలోని కడిపికొండ ఆర్వోబీ కింద ప్రాంతమంతా మొక్కలు నాటి గ్రీనరీగా తయారు చేయాలని రైల్వే కార్మికులు అంటున్నారు. బ్రిడ్జి కింద దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేసి, పేరుకుపోయిన చెత్తాచెదారంను, చెట్లను తొలగించి వివిధ రకాలైన మొక్కలు నాటాలన్నారు. ఈ ప్రాంతమంతా సుందరీకరించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చేయాలని రైల్వే కార్మిక నాయకులు అంటున్నారు.


కడిపికొండ బ్రిడ్జి కింద పేరుకుపోయిన చెత్తాచెదారం


బ్రిడ్జి కింద పెరిగిన చెట్లు, పేరుకపోయిన చెత్తాచెదారం

క్లుప్తంగా

వెలుగుల పండుగ దీపావళి : మేయర్

వరంగల్ అర్బన్ : వరంగల్ మహానగర ప్రజలకు మేయర్ గుండు సుధారాణి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీపావళి వెలుగుల పండుగ అని, అంధకారాన్ని తొలగించి వెలుగు ప్రసరించే ఈ పండుగ మనకు ఆనందం, శాంతి, ఐక్యతను తీసుకు రావాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సురక్షితంగా, పర్యావరణ హితంగా దీపావళిని జరుపుకోవాలని కోరారు. స్వచ్ఛ వరంగల్ నిర్మాణంలో భాగస్వాములవుదామని పేర్కొన్నారు.

గాంధీనగర్‌లో నరకాసుర వధ



హన్మకొండ : హనుకొండ గాంధీనగర్‌లో దీపావళి వేడుకల్లో భాగంగా ఆదివారం నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణ ధరించిన పిల్లలు నరకాసురుని వధించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి గెలిచిన రోజుగా దీపావళి జరుపుకుంటామన్నారు. గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, కమిటీ బాధ్యులు సత్య నారాయణ, వీరేందర్, జనార్దన్‌రెడ్డి, అశోక్, వెంకటరమణ, నరేందర్, శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మట్టి ప్రమిదలనే ఉపయోగిద్దాం



విద్యారణ్యపురి : దీపావళి పండుగ సందర్భంగా మట్టి ప్రమిదలనే ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడుదామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించి మట్టి ప్రమిదలను పంపిణీ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి అనంత్, కోశాధికారి రమేష్, బాధ్యులు పాల్గొన్నారు.

గీతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ విభాగం పరిశోధకురాలు కె.గీతకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఫెయిర్స్ అండ్ ఫెస్టివల్స్ ఇన్ తెలంగాణ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గీతకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. హిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఎస్ శ్రీనాథ్ పర్యవేక్షణలో గీత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఏకశిల పార్కులో అభివృద్ధి పనులు

హన్మకొండ : హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.5 లక్షల నిధులతో పార్కుకు తూర్పు వైపు ఐరన్ గేట్, యోగా షెడ్, జిమ్ములో కంకర, పిల్లల ఆటస్థలంలో ఇసుక, ఆర్చ్ వద్ద ఎర్రమట్టి పోసి మొక్కలు నాటడం పనులకు ఈ నిధులు మంజూరయ్యాయని ఆయన వివరించారు.

అరుణ్‌కుమార్‌కు సన్మానం

ఖిలా వరంగల్: ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో పెరకవాడకు చెందిన తౌటం అరుణ్ కుమార్ 98వ ర్యాంక్ సాధించి సెక్రటరేట్‌లో జీడీఏ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా నియామక పత్రం అందుకున్నారు. ఆదివారం అరుణ్‌కుమార్‌ను జిల్లా పద్మశాలి గౌరవ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

నేడు వల్లంపట్ల జన్మదిన చైతన్య కార్యక్రమం

విద్యారణ్యపురి : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సంఘ సేవకులు, కళాకారులు, వనప్రేమి వల్లంపట్ల నాగేశ్వర్‌రావు 70 వసంతాల జన్మదిన చైతన్య కార్యక్రమాన్ని నేడు (సోమవారం) ఉదయం 10 గంటలకు హనుమకొండలోని టీచర్స్‌కాలనీ ఫేజ్–1 కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, గౌరవ అతిథిగా కేయూ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు బన్న అయిలయ్య పాల్గొననున్నారు.

ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

- ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్ : ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలని, ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పక్కగా అమలు చేయాలని ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ హంటర్ రోడ్డు ఓపెన్ బిర్లా మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఓసీ సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఓసీ ప్రతినిధులు గంగు ఉపేంద్రశర్మ, దుబ్బ శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన అగ్రకుల పేదల ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ అన్ని కులాలకు రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు ఇచ్చిన ఏడున్నర దశాబ్దాలకు పైగా అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలు తీర్మానాలను సదస్సు ముందు ఉంచగా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో రాయపాటి వెంకటేశ్వర్‌రావు, రామారావు, సంజీవరెడ్డి, వేణుగోపాల్, వంగేటి అశోక్, పాపారావు, నర్సింహరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, 600 మంది ఓసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి

విద్యారణ్యపురి : రాష్ట్రంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని మానసికంగా క్షోభకు గురవుతున్నారని మానవీయ కోణంలో ఆలోచించి ప్రభుత్వం వెంటనే వెంటనే బకాయిలు చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ బెనిఫిట్స్ బకాయిలసాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ల ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావల్సిన బెనిఫిట్స్ చెల్లించాలని ప్రాణాలు కాపాడాలన్నారు. అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కందుకూరి దేవదాస్, బాధ్యులు ఎండీ. మహబూబ్ అలీ, దామోదర్, ఆర్‌పీ చలం, ఇంద్రసేనారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

హామీలను విస్మరించిన కాంగ్రెస్


బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాకప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

ఖిలా వరంగల్ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి పాలన సాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. ఆదివారం రంగశాయిపేట మహంకాళి దేవాలయం సమీపంలో కిరణ్ అధ్యక్షతన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా నరేందర్ హాజరై జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించారు. ఆ తర్వాత 42వ డివిజన్‌కు చెందిన 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పూసల కిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అభివృద్ధి సాధించేందుకు కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ పార్టీ మా త్రమే ప్రత్యామ్నాయమని అన్నారు. అనంతరం 42వ డివిజన్‌లో ఇంటింటికి బాకీ కార్డు పంపిణీ చేశారు. టి.రమేష్‌బాబు, ప్రవీణ్, కొంతం మోహన్, పూల కార్తీక్, నీల రాజు, విష్ణు, శివాజీ, సాగర్, రవీందర్, కిరణ్, రాజేందర్, విజయ్, పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హన్మకొండ : విద్యతోనే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్జీఓస్ కాలనీ రోడ్ శ్రీనగర్ కాలనీలోని కేఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ పేద విద్యార్థులు ఉన్నత చదువు చదివేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 23 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన ఆరుగురికి నగదు బహుమతి, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్దోజు విద్యాసాగర్, ప్రచార కార్యదర్శి శ్రీరామోజు రాజ్‌కుమార్, కోశాధికారి వలబోజు కేశవరావు, ప్రతినిధులు దాసోజు గోవర్ధన చారి, శ్రీనివాస్, డాక్టర్ సురేందర్, వెంకటరమణ, సురేష్ బాబు, భిక్షపతి, సదానంద చారి, నరసింహచారి, శ్రీధర్, దేవేందర్, తంగళ్ళపల్లి జయసేన, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

రామదాసు పీఠం మూలనిధికి విరాళం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. హనుమకొండ వాస్తవ్యులు సముద్రాల రామనరసింహాచార్యులు– సుజాతదేవి దంపతులు రామదాసు పీఠం మూలనిధికి రూ.1,00,101 అందించారు. వీరికి ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్ రశీదు ఇవ్వగా ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, ప్రధాన అర్చకులు సీతారామానుజాచార్యులుపాల్గొన్నారు. అనంతరం దాతలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


హనుమకొండ దాతలతో ఆలయ ఉద్యోగులు, అర్చకులు

ఆశ్రమాల్లో దీపావళి సంబురాలు


వృద్ధులతో కలిసి క్రాకర్స్ కాల్చుతున్న అనితారెడ్డి

హన్మకొండ/విద్యారణ్యపురి : హనుమకొండలోని స్వధార్ ఆశ్రమం, అర్బన్ డిప్రవడ్ అనాథ పిల్లల ఆశ్రమం, స్పందన మానసిక వికలాంగుల ఆశ్రమంలో, యూనివర్సిటీ సమీపంలోని లార్డు వృద్ధాశ్రమంలో ఆదివారం అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు కరుకాల అనితారెడ్డి ఆధ్వర్యంలో దీపావళి సంబురాలు జరుపుకున్నారు. పిల్లలతో బాణసంచా కాల్చించారు. మిఠాయిలు పంచారు. అన్ని కోల్పోయి జీవితంలో చివరి దశకు చేరిన వృద్ధులకు పండుగ సంతోషాన్ని పంచేందుకు ఇక్కడ దీపావళి బాణసంచాను అందించామని తెలిపారు. కార్యక్రమంలో కరుకాల ఆర్వికారెడ్డి, శైలజ, ప్రసన్న కుమార్, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

విద్యారణ్యపురి : పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ఇంద్రనగర్‌లోని ప్రభుత్వ ఎస్ఎంహెచ్ ఎస్సీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బాధ్యులు ఆర్ పవన్‌కుమార్, రాంప్రసాద్, జోష్‌నిఖిల్, చరణ్, నాగరాజు, శ్రీనాథ్, అన్నమయ్య ,శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంద శ్రీకాంత్

సంక్షిప్త సమాచారం

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

హన్మకొండ : మడికొండ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి మాసశివరాత్రి పురస్కరించుకొని మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్రహోమం చేశారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో శివాలయం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సునిత, రామలయం కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో గౌస్‌పాషా, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నేత గోపాల నవీన్‌రాజు, సామాజిక వేత్త మేరుగు అశోక్ హాజరై వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. హిందువులు, ముస్లింలు సమష్టిగా గ్యార్మీ వేడుకలు జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఎండీ.షౌకత్, మహ్మద్ మహమూద్, మహ్మద్ యాకూబ్, అఫ్జల్, యాకూబ్, గడ్డం రవి, శివ పాల్గొన్నారు

రాములుకు సన్మానం

విద్యారణ్యపురి : హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ సిహెచ్.రాములు ఢిల్లీలోని విస్డమ్ ఫౌండేషన్ ద్వారా ఇటీవలే విజయ్ గౌరవ్ సన్మాన్ బెస్ట్ అవార్డు 2025ను అందుకున్నారు. ఆదివారం పాఠశాలలో రాములను హెచ్ఎం ఉమ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఉమా మాట్లాడుతూ రాములు హిందీ భాషలో నూతన పద్ధతులలో సులభరీతిలో నైపుణ్యాలను పెంపొందిస్తున్నారన్నారు. రాములుకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోచమ్మగుడికి రేకుల షెడ్ ఏర్పాటు

ఖిలా వరంగల్ : తూర్పుకోటలోని శ్రీ పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో నలివేల జయ, రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్ ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై రూ.2లక్షలతో నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. బోగి సురేష్, ఎల్లయ్య, వాసుదేవ్, మహేష్ పాల్గొన్నారు.

మార్కెట్లో సరికొత్త దీపాలు



ఖిలా వరంగల్ : దీపావళి పండుగ సందర్భంగా వరంగల్ మార్కెట్‌లో వివిధ రకాల ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా విభిన్న రంగులు, ఆకృతుల్లో ప్రమిదలను వ్యాపారులు అందుబాటులోకి తెచ్చారు. సంప్రదాయ మట్టి ప్రమిదలు అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. పూసలు, బంగారు పూతతో డిజైనర్ ప్రమిదలు,రంగుల్లో పూల ఆకృతిలో ఉన్న ప్రమిదలు,రంగుల్లో పూల ఆకృతిలో ఉన్న ప్రమిదలు వినియోగదారులను కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా కుండీలు, ప్లేట్లు, బాతులు, తాబేలు, దీపం, గిన్నెలు వంటి ఆకృతుల్లో కళాకారులతో అందంగా తయారు చేయించి విక్రయిస్తున్నారు. గతంలో దీపావళి అంటే ఇంటి ముందు వరుసగా మట్టి ప్రమిదల్లో నూనె పోసి దీపాలను అలంకరించేవారు. ఇటీవల కాలంలో మట్టి ప్రమిదల వినియోగంతో పాటు ఇంటి లోపల సైతం అందంగా పూలను ముగ్గులా పేర్చి దీపాలను అలంకరించటం ప్రస్తుతం ఫ్యాషన్‌గా మారింది.

కార్పొరేటర్‌కు పరామర్శ



వరంగల్ చౌరస్తా : ఇటీవల అస్వస్థతకు గురైన 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్‌ను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పరామర్శించారు. వరంగల్ రాంకీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. వారి వెంట కాంగ్రెస్, బీజేపీ నాయకులు కొరివి పరమేశ్వర్, గోరంటల రాజు, ఓసిటీ కాలనీ ప్రతినిధి చంద్రశేఖర్ ఉన్నారు.

23న సదర్ వేడుకలు

ఖిలా వరంగల్ : ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు మధ్యకోట ఖుషిమహల్ మైదానంలో సదర్ వేడుకలు జరగనున్నాయి. వేడుకల్లో హర్యానా దున్నపోతుల ఆటలతో నూతన ఉత్సాహం కలిగేలా సంబురాలు నిర్వహించనున్నట్లు రవి ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.